క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ విధానంపై అవగాహన

సరుబుజ్జిలి: సార్వత్రిక విద్యా విధానం ద్వారా పది, ఇంటర్ చదువుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, డి.బాలరాజు తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ విధానంపై బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, వెంకటసాయి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, సీఆర్ఎంటీ బెండి చిన్నారావు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

48 మందికి వైద్య పరీక్షలు

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట)లో బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 48 మంది రోగులకు తనిఖీలు నిర్వహించారు. ఆరుగురు జ్వరబాధితులను గుర్తించి రక్తపూతలు సేకరించారు. ఉచితంగా మందులు అందజేశారు. సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు లఖినాన సరోజిని, టి.తేజారావు, ఏఎన్ఎం కె.గౌరి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.సుప్రియ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి


సవర అన్నపూర్ణమ్మ (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని గొడ్డ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సవర అన్నపూర్ణమ్మ బుధవారం సాయంత్రం మృతి చెందారు. సోమవారం అనారోగ్యం కారణంగా అస్వస్థతకు గురయ్యారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2009 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరి 2019లో జిల్లా ఎస్టీ మహిళా విభాగంలో అధ్యక్షురాలిగా పనిచేశారు. అప్పటి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి నేతృత్వంలో చాలా చురుగ్గా పనిచేశారు. అన్నపూర్ణమ్మ మృతి పార్టీకి తీరనిలోటని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆమె మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. అన్నపూర్ణమ్మకు భర్త శంకరరావు (రిటైర్డ్ ఉపాధ్యాయుడు), ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వంజంగిలో విషాదం

ఆమదాలవలస: అనకాపల్లి జిల్లాలోని ఎస్సైన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం జరిగిన పేలుడులో ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్ (23) అనే యువకుడు మృతి చెందారు. రెండు నెలల క్రితమే ఆ కంపెనీలో జాయిన్ అయ్యాడని గ్రామస్తులు తెలిపారు. మృతునికి తల్లిదండ్రులు ధర్మారావు, తులసమ్మ ఉన్నారు. రాజశేఖర్ మృతి వార్త తెలుసుకున్న గ్రామస్తులు, సమీప బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

110 మందికి నేత్ర పరీక్షలు

సారవకోట: మండలంలోని అలుదు ప్రాథమిక పాఠశాల ఆవరణలో వరుదు పరిమళ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 110 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వరుదు పరిమళ జయంతి సందర్భంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విశాఖపట్నం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శంకర ఫౌండేషన్‌కు చెందిన వైద్యులు శివ ప్రసాద్ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 74 మందికి కంటి శస్త్ర చికిత్సల కోసం తరలించారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకుడు వరుదు దేవీ ప్రసాద్, సర్పంచ్ సాగిపల్లి దండాశి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై కుక్కల దాడి

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో ఐదేళ్ల బాలుడు సెలగల జయరామ్‌పై కుక్కలు దాడి చేసి గాయపర్చిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గల వీధిలో బాలుడు ఆడుతుండగా నాలుగు కుక్కలు గుంపుగా వచ్చి గాయపర్చాయి. బాలుడిని వెంటనే 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని ముఖ్య రహదారి, అత్యంత రద్దీగా ఉండే పర్లాఖిమిడి–పలాస రహదారిలో చాపర పెట్రోల్ బంక్ సమీపంలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పట్టపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంబాళ్ల వెంకటరావు తన సొంత నిధులు వెచ్చించి బుధవారం జేసీబీతో రహదారిలోని గోతులను పూడ్చారు. ప్రమాదాలు కొంతమేర నివారించవచ్చునని, వాహన చోదకులు అతనిని అభినందించారు.


తాళ్లవలస వద్ద గల డంపింగ్ యార్డ్

డంపింగ్ యార్డ్ నిర్వహణపై..
నీలి నీడలు

- చెత్తను రీసైక్లింగ్, రీయూజ్ విషయాలను మరిచిన అధికారులు
- నిరుపయోగంగా కంపోస్టు యార్డ్ భవనాలు

ఆమదాలవలస: మున్సిపాలిటీకి సంబంధించి తాళ్లవలస వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ నిర్వహణపై నీలినీడలు అలముకున్నాయి. దీని నిర్వహణ వైపు మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడటం లేదు. యార్డులో తడి, పొడి చెత్త ఒకే దగ్గర వేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి ఏర్పడుతుంది. చెత్త నుంచి సంపద కేంద్రం ఏర్పాటు చేసి, కంపోస్టు చేసి, ఆ కంపోస్టును విక్రయించి మున్సిపాలిటీకి ఆదాయం చేకూర్చాలనే ఉద్దేశంతో డంపింగ్ యార్డు వద్ద రూ.లక్షల వ్యయంతో భవన నిర్మాణాలు చేపట్టారు. గత 6 ఏళ్ల క్రితం నిర్మించి ఈ భవనాలు కొత్తలో అప్పటి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా పనులు నిర్వహించారు. ఆయన బదిలీపై 4 ఏళ్ల క్రితం వెళ్లిపోవడంతో కంపోస్టు తయారీపై మున్సిపల్ అధికారులు చిరుకన్ను వేశారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే అధికారులు నిర్లక్ష్యం డంపింగ్ యార్డు నిర్వహణలో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. 23 వార్డుల్లో సేకరించిన చెత్తను అక్కడకు చేర్చి, తడి–పొడి చెత్తగా వేరు చేయాలి. తడి చెత్తను కంపోస్టుకు, పొడి చెత్తను కాల్చి వేసేందుకు వినియోగించాల్సి ఉండగా ఆ ప్రాంతంలో వేరు చేసే దాఖలాలు లేవు. 'చెత్త చెత్త కాదు, చెత్తను సద్వినియోగం చేద్దా.. చెత్తపై సమరం చేద్దాం.. చెత్తను రీసైకలింగ్ చేద్దాం.. రీయూజ్ చేద్దాం' అన్న నినాదం మున్సిపల్ అధికారుల సెల్ ఫోన్‌లకు డైలర్ టోన్‌గా మాత్రమే వినియోగిస్తున్నారు కానీ.. ఆ నినాదం వినియోగంలోకి తీసుకువచ్చి ఆచరించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు కూడా అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని దీంతో ప్రజలు రోగాల బారీన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పనులు సక్రమంగా నిర్వహించాలని కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న కంపోస్టు యార్డ్ భవనం

అంతంత మాత్రంగానే పారిశుద్ధ్య పనులు..

మున్సిపాలిటీలోని 23 వార్డుల్లో 11,313 నివాస గృహాలున్నాయి. 39,806 మంది జనాభా ఉన్నారు. సుమారు 120 మంది పారిశుద్ధ్య కార్మికులు పనులు నిర్వహించేందుకు అవసరం ఉండగా.. ప్రస్తుతం 65 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగానే నిర్వహిస్తున్నారు. డంపింగ్ యార్డులో పనిచేసేందుకు పారిశుద్ధ్య కార్మికులు చాలడం లేదని అధికారులు చెబుతున్నారు.


డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్న ట్రాక్టర్


పట్టణంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సిబ్బంది కొరత

మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉంది. దీంతో పనులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నాం. నాలుగు చెత్త సేకరణ వాహనాలున్నాయి. వాటిలో డంపింగ్ యార్డుకు చెత్తను పంపిస్తున్నాం. అది వేరు చేయడానికి అక్కడ సిబ్బంది లేరు. ఉన్న సిబ్బందికి నిత్యం మున్సిపాలిటీలో క్లీనింగ్‌కు మాత్రమే టైమ్ సరిపోతుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే సిబ్బంది కొరత తీర్చి పనుల నిర్వహణకు చర్యలు చేపడతాం.

– పప్పల రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆమదాలవలస మున్సిపాలిటీ

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


పొందూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దళిత సంఘ నాయకులు

పొందూరు: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు నిరసనగా మండలంలోని దళిత సంఘాలు బుధవారం నిరసన ర్యాలీలు నిర్వహించాయి. వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి దళిత సంఘాలు బుధవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా పొందూరు, జీ.సిగడాం మండలాలకు చెందిన దళిత సంఘాల నాయకులు మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రమేష్, ఎస్ఐ రమణకు వినతిపత్రాలు అందించారు. ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి, దళిత సంఘాల నాయకులు ఎం.సునీల్‌కుమార్, ఆర్.గవర్రాజు, ఎస్.రాము, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణకు నిరసనగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద బుధవారం బంద్ పాటించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ నిర్వహించామని జిల్లా దళిత నాయకులు బెంజమన్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు టి.తిరుపతి, ఉపాధ్యక్షుడు వదమ శ్రీను, ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణం, కోశాధికారి బొడ్డేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

వర్గీకరణ చేయవద్దు

నరసన్నపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయవద్దని, దీని వల్ల ఎస్సీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఎస్సీ సంఘ నాయకులు సతివాడ రామినాయుడు, కల్లేపల్లి లక్ష్మణరావు, కోటిపల్లి శ్రీను, పెరుమొళ్ల తవిటినాయుడు, ముచ్చ గణేష్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవరించాలని, ఎస్సీ వర్గీకరణ చేయవద్దని బుధవారం నరసన్నపేటలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కాలేజీ రోడ్డులో మానవ హారం నిర్వహించారు. నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ సంఘాలకు చెందిన ప్రతినిధి చింతాడ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం వినతిపత్రం అందించారు. అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. పొందూరు మండల కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ఆమదాలవలస మండలంలోని తొగరాం డిగ్రీ కళాశాల, సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస జూనియర్ కళాశాలలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. బూర్జ మండలంలోని నారాయణపురం ఆనకట్టు ఆధునీకరణ పనులు చేపట్టేంకు నిధులు మంజూరుచేయాలని విన్నవించారు.

ఒడియా అధ్యాపకుడిని నియమించాలి


ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒడియా విద్యార్థులు చదువుతున్నారని, ఒడియా లాంగ్వేజ్ అధ్యాపకుడిని నియమించాలని ఒడియా లాంగ్వేజ్ మైనార్టీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథ్ బరాడో అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ బరోడా మాట్లాడుతూ 1975లో పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థాపించారని, అప్పటినుంచి ఒడియా విద్యార్థులు చదువుతున్నారని, ఇంతవరకు కళాశాలలో ఒడియా అధ్యాపకులు లేరన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఒడియా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

సారవకోట: గత ప్రభుత్వంలో మంజూరైన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 211 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాకుండా ఉన్నాయని, 100 రోజుల ప్రణాళికల్లో భాగంగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన లే అవుట్‌లలో విద్యుత్ సమస్య, నీటి సమస్య ఉన్నందున నిర్మాణాలు చేపట్టేందుకు చాలా మంది ముందుకు రావడం లేదని పలువురు సచివాలయ ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ రేణుక, గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రసాదరావు పాల్గొన్నారు.

తిరుమలకు గోపాలపెంట బృందం


గోపాల పెంట భజన మండలి సభ్యులు

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటకు చెందిన సోమేశ్వర భక్తి భజన మండలి బృందం బుధవారం తిరుమలకు పయనం అయింది. ఈ నెల 23న శుక్రవారం తిరుమలలో అఖండనామ సంకీర్తన కార్యక్రమంలో వీరు భజన చేయనున్నారు. 15 మంది సభ్యులు తిరుమలకు వెళ్లారు. ఇటువంటి అవకాశం రావడం ఆనందంగా ఉందని భజన మండలి సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

అటవీ హక్కులపై అవగాహన

పాతపట్నం: గిరిజనులకు అటవీ హక్కుల చట్టంపై పూర్తి అవగాహన ఉండాలని వెలుగు సీసీ జగన్ అన్నారు. మండలంలోని సోభ పంచాయతీ పరిధిలోని కొమ్మలగూడ కమ్యూనిటీ హాల్‌లో కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అటవీ హక్కులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు, రిసోర్స్‌పర్సన్ చిరంజీవి, సవర కామేశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో గుర్తించిన పనులకు ప్రాధాన్యం

ఎల్.ఎన్.పేట: గ్రామ సభల్లో గుర్తించిన పనులకు ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుందని ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీన అన్ని పంచాయతీల్లోనూ ఒకే సమయంలో గ్రామ సభలు ప్రారంభం కావాలని సూచించారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లతోపాటు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వయోజనులు, అన్ని వర్గాల వారిని గ్రామ సభలకు ఆహ్వానించాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు, గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి గ్రామ సభల్లో ప్రజలకు తెలియజేసి తీర్మానం చేయాలన్నారు.

రహదారులు బాగుచేయాలి

మెళియాపుట్టి: మండలంలోని రహదారులను బాగుచేయాలని పలువురు సభ్యులు కోరారు. మండలంలోని ఉపాధి హామీ సమావేశ మందిరంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పలు శాఖలకు చెందిన నివేదికలను సంబంధిత శాఖ అధికారులు చదివి వినిపించారు. ముఖ్యంగా రహదారులు, తాగునీటి సమస్యలపై సభ్యులు మాట్లాడారు. అంగన్‌వాడీలలో పోషక పదార్థాలు సక్రమంగా అందించాలని, పలు పాఠశాలలకు ప్రహరీల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. దబ్బగూడలో పాఠశాల భవనం కూలిపోయే ప్రమాదం ఉందని, నూతన భవనం నిర్మించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల జారీ చేస్తే సమస్యలను పరిష్కరించ దానికి మార్గం సుగమం అవుతుందని పలువురు అధికారులు తెలిపారు. ఎంపీపీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం చేయవచ్చన్నారు. వైస్ ఎంపీపీ ఆదినాయుడు, ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ హనుమంతరావు, ఎంఈఓ దేవేంద్రరావు, ఏపీఓ రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

సారవకోట: తమ సమస్యలు శాసన మండలిలో చర్చించాలని విశాఖపట్నం ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. బుధవారం ఆమె పాఠశాలను సందర్శించారు. జీఓ నెం 117 రద్దు జరిగేలా చూడాలని, ఉపాధ్యాయులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యలు శాసన మండలిలో చర్చించి పరిష్కారం జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తాను అలుదు, సారవకోట ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాని అన్నారు. హెచ్ఎం తంప రామారావు ఉన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు


పాతపట్నం: మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్

పాతపట్నం: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని జెడ్పీ సీఈఓ వెంకట్రామన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సర్వే కోసం బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇంటింటా సర్వేలు నిర్వహిస్తున్నామని, ఈ సర్వే సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ల నమోదు, బదిలీ, చిరునామా, ఫొటో మార్పుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఎలక్షన్ డీటీ శైలజ పాల్గొన్నారు.

ఓటర్ల సవరణపై అవగాహన

బూర్జ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సవరణపై తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ బుధవారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఎస్ఆర్ 2025 సర్వే నెల రోజులపాటు నిర్వహిస్తామన్నారు. డీటీ సంతోష్‌కుమార్, ఆర్ఐ వెంకటరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ

నరసన్నపేట: ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టిందని, రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్ఓ రామ్మోహనరావు సూచించారు. ఓటర్ల జాబితా సవరణపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. జనవరి నాటిని 18 ఏళ్లు నిండినవారు ఓటు హక్కు నమోదుకు అర్హులన్నారు.

ఈ–క్రాప్ నమోదు వేగవంతం


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

హిరమండలం: రైతులు సాగుచేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.వెంకటరమణ, ఏఓ బి.సంధ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ వ్యవసాయ సిబ్బంది, వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా ఇప్పటివరకు ఎంతమేర క్షేత్రస్థాయిలో నమోదు చేశారో ప్రగతిపై సమీక్షించారు. మండలంలో 7,200 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు జరుగుతందన్నారు. శతశాతం పంట నమోదు చేయాలని సూచించారు. ఏ సర్వే నంబర్‌లో ఏయే పంటలు సాగుచేస్తున్నారో తదితర వివరాలను తెలిపి అధికారులకు సహకరించాలని సూచించారు. పంటల నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలకు అర్హత పొందుతారన్నారు. మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకోవచ్చునన్నారు. కౌలు రైతుల సైతం పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయక అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి మ్యాథ్‌మేటిక్స్ అతిథి అధ్యాపకునిగా పనిచేసేందుకు ఆసక్తి గలవారు ఈ నెల 23 సాయంత్రం 4 గంటలులోగా కళాశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాడుగుల నాగేంద్ర బుధవారం ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసి 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ఎంపికలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్‌లు, బయోడేటా, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పొందూరులో..

పొందూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఇజ్జాడ మల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. భౌతికశాస్త్రం, పౌరశాస్త్రం, ఎలక్ట్రికల్(వీవోసీ) సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా, బీటెక్‌లో 60 శాతం మార్కులు ఉండాలన్నారు. ఒకసెట్ జిరాక్స్ పత్రాలు, ఫొటోతో సహా బయోడేటా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించాలని కోరారు. విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ సబెక్టు బోధనకు గెస్ట్ లెక్చలర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23వ తేదీలోగా కళాశాలలో ఉన్న తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలజీలో సివిక్స్ అధ్యాపకుని పోస్టు కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలు లోగా దరఖాస్తులను కాలేజీలో అందజేయాలన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, ఒకేషనల్ కామర్స్ (ఏఈటీ) సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలన్నారు. ఒక సెట్ ఒరిజినల్ పత్రాలు, ఫొటోతో సహా బయోడేటాను నేరుగా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా కళాశాలలో అందజేయాలన్నారు. ఈ పోస్టులకు విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

బాధ్యతల స్వీకరణ


సరుబుజ్జిలి: ఎంపీడీఓను అభినందిస్తున్న ఉద్యోగులు

సరుబుజ్జిలి: స్థానిక ఎంపీడీఓగా పీవీ మురళీమోహన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓను సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు అభినందించారు.

ఎంపీడీఓగా కాశీప్రసాద్..


కాశీప్రసాద్, ఎంపీడీఓ

ఎల్.ఎన్.పేట: స్థానిక ఎంపీడీఓగా కాశీప్రసాద్ బుధవారం విధుల్లోకి చేరారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఎంపీడీవోగా పనిచేసిన కాశీప్రసాద్ ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చారు. విధుల్లోకి చేరిన ఎంపీడీఓను పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ


కూరగాయల స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శాతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రణాళిక తయారుచేసుకోవాలని, విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. డార్మిటరీలు, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.